

వైసీపీ సమావేశంలో రేషన్ డీలర్

శ్రీకాకుళం క్రైం, మార్చి 30: ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే వారు పార్టీ మీటింగ్‌లకు, ప్రచారాలకు దూరంగా ఉండాలన్న ఎన్నికల అధికారుల ఆదేశాలను కొందరు బేఖాతర్ చేస్తున్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో శనివారం రాత్రి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిర్వహించిన సమావేశానికి ఏడురోడ్ల కూడలి సమీపాన ఉన్న ఓ రేషన్ డీలర్ హాజరయ్యాడు. అంతటితో ఆగకుండా యువజన కమిటీలో పాల్గొంటూ మంత్రి చేతుల మీదుగా కండువాలు వేయించుకున్నాడు. మంత్రితో కలిసి ఫొటోలకు ఫోజులు కూడా ఇచ్చాడు. ఈ ఘటనలపై ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో మరి!

కండువాలు వేసుకుంటే క్రికెట్ కిట్లు

- యువతకు వైసీపీ నాయకుల ఎర
- టీడీపీలోనే కొనసాగుతామన్న మూలసవలాపురం వాసులు

(సరుబుజ్జిలి)



యువకుడికి వైసీపీ కండువా కప్పిన స్పీకర్ తమ్మినేని



టీడీపీలోనే ఉంటామంటూ కండువాలు వేసుకున్న మూలసవలాపురం యువత

ఎన్నికల్లో విజయం కోసం వైసీపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తూ పంపకాల పర్వానికి తెర తీస్తోంది. ఇప్పటికే కొన్నిచోట్ల మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు చీరలు, డబ్బులు పంపిణీ చేసింది. ఎలాగైనా ఓట్లు మనకే పడేలా చేయాలంటూ.. వలంటీర్లకు సైతం తాయిలాలు అందజేసింది. తాజాగా యువతకు ఎర వేస్తోంది. వైసీపీ కండువాలు వేసుకుంటే.. క్రికెట్ కిట్లు ఇస్తామంటూ గాలం వేస్తోంది. ఆమదాలవలస నియోజకవర్గంలో సరుబుజ్జిలి మండలం మూలసవలాపురం గ్రామానికి చెందిన యువతకు 'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ కిట్‌లు ఇస్తామంటూ స్థానిక వైసీపీ నేతలు కొంతమంది శుక్రవారం సాయంత్రం స్పీకర్ తమ్మినేని సీతారామ్ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లిన తర్వాత వైసీపీ కండువాలు వేసుకోవాలంటూ స్పీకర్ తమ్మినేనితోపాటు మండల వైసీపీ నాయకులు ఒత్తిడి చేశారు. తీరా కండువాలు వేసుకున్న తర్వాత వారికి క్రికెట్ కిట్‌లు ఇవ్వకుండా పంపించేశారు. దీంతో మూలసవలాపురానికి చెందిన మంజి వెంకటరమణ, కెల్లి గణేష్, బొబ్బాది దిలీప్, జొన్నాడ కోమలరావు, తర్లాడ సతీష్, అరవల పవన్, జొన్నాడ దిలీప్ తదితర యువకులంతా నిరాశతో వెనుదిరిగారు. వారంతా శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ సమక్షంలో విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ కిట్‌లు ఇస్తామని చెప్పి బలవంతంగా తమకు వైసీపీ కండువాలు వేశారని వివరించారు. 30 ఏళ్ల నుంచి టీడీపీలో కొనసాగుతున్నామని, టీడీపీకి ద్రోహం చేసేది లేదంటూ ప్రకటించారు. పార్టీ నాయకుల సమక్షంలో టీడీపీ కండువాలు వేసుకున్నారు. అనంతరం టీడీపీ రాష్ట్రకార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ మాట్లాడుతూ.. స్పీకర్ తమ్మినేని సీతారాం ఓటమి భయంతోనే యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ ఇటువంటి చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తర్లాడ సిద్ధు, సురేంద్ర, మండల తెలుగుయువత అధ్యక్షుడు తాడేల రాజారావు, ఈశ్వరరావు, సూర్యనారాయణ, అప్పలనాయుడు, మల్లేశ్వరరావు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో టీచర్లు

- ఇద్దరిని సస్పెండ్ చేసిన డీఈవో

అరసవల్లి, మార్చి 30: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వేంకటేశ్వరరావు తెలిపారు. పలాస మండలం పెద్దంచల గ్రామం జడ్పీహెచ్ స్కూల్ ఎస్‌జీటీ బెహరా మాధవరావు రాజకీయపార్టీల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఫిర్యాదు రావడంతో విచారణకు ఆదేశించామన్నారు. పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో భరత్ నాయక్ దీన్ని ధ్రువీకరించడంతో మాధవరావును సస్పెండ్ చేశామన్నారు. అలాగే సారవకోట మండలం మొగుపురం ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న చౌదరి లక్ష్మీనారాయణ వాట్సాప్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి నిర్ధారించారని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడంతో లక్ష్మీనారాయణను కూడా సస్పెండ్ చేశామని డీఈవో తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

గంటన్నర ముందే మాక్ పోల్

- ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోలదే కీలకపాత్ర
- విధుల్లో పొరపాట్లకు తావు లేదు: కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మార్చి 30: 'ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోలది అత్యంత కీలకపాత్ర. పోలింగ్ నిర్దేశిత సమయానికి కన్నా.. గంటన్నర ముందే మాక్ పోల్ నిర్వహించాలి' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. మాక్ పోల్ అనంతరం ఈవీఎంలో డిలీట్ చేయాలి, వీవీ ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండరాదని స్పష్టం చేశారు. శనివారం స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించిన పీవోలు, ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో పీవోగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశం. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. పోలింగ్ బూత్‌లో పీవోదే పూర్తి అధికారం. విధి నిర్వహణలో పొరపాట్లకు, వ్యక్తిగత అభి ప్రాయాలకు తావులేదు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు కచ్చితంగా అమలు చేయాలి. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వరాదు. ఎన్నికల నిర్వహణలో ఏమైనా అనుమానాలుంటే జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు, నియోజకవర్గ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలి. హింసకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలి. పోలింగ్‌కు ముందురోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలి. పీవోలు ఫారం 17సీ, డైరీ, రిపోర్టు, డిక్లరేషన్‌లను కచ్చితమైన వివరాలతో నింపాలి' అని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

70 మద్యం సీసాల స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, మార్చి 30: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేటకు చెందిన కోనాడ శ్యామ్‌సుందర్ తన ద్విచక్ర వాహనంపై శనివారం 70 మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం వాడవీధిలో కాపుకాసి ఆయన్ను పట్టుకున్నట్లు చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. శ్యామ్‌సుందర్‌తో పాటు ఈ మద్యం సీసాలను అమ్ముకునేందుకు సహకరిస్తున్న ఫాజుల్‌బాగ్‌పేటకు చెందిన అలాపాన వరలక్ష్మిని కూడా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. వరలక్ష్మిపై గతంలోనూ మద్యం కేసులు ఉన్నట్లు చెప్పారు.

మూడు రాజధానులు ఎక్కడ జగన్?

- చూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా: అచ్చెన్నాయుడు సవాల్


అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరిన భావనపాడు వాసులు

సంతబొమ్మాళి, మార్చి 30: రాష్ట్రంలో మూడు రాజధానులు ఎక్కడ ఉన్నాయో సీఎం జగన్ చూపిస్తే ఈ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. శనివారం భావనపాడులో ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో భావనపాడుకు చెందిన మాజీ సర్పంచ్‌లు సైన గురువులు, అల్లుపల్లి పోతయ్య ఉపసర్పంచ్ గొరకల దుర్గారావు, సొసైటి అధ్యక్షుడు గొరకల ఆదినారాయణ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. అనంతరం నిర్వహించిన సభలో అచ్చెన్న మాట్లాడారు. సీఎం జగన్ కర్నూలు సభలో పచ్చి అబద్ధాలు మాట్లాడారని, రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లామని సిగ్గులేకుండా చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రాన్ని 50 ఏళ్ల వెనక్కి నెట్టేసిన దుర్మార్గుడు జగన్. ఆయన బాబాయిని చంపిన హంతకులతోనే ప్రతిరోజూ ప్రచారంలో పాల్గొంటున్నాడు. ఐదేళ్లలో ఒక్క సారైనా వివేకానంద హత్యపై పోలీసు అధికారులతో సమీక్ష చేశారా?. రానున్న ఎన్నికల్లో జగన్ అరాచకాలకు ఓటర్లు కర్రకాల్చి వాత పెడతారు. పేదల సంక్షేమంతో పుట్టిన పార్టీ తెలుగుదేశం. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని పథకాలు ఇంటి వద్దనే అందజేస్తాం. పింఛన్ తీసుకోవడానికి మూడు నెలలు గడువు పెంచుతాం. 50ఏళ్లకే మత్స్యకారులకు పింఛన్ మంజూరు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. తితలీ సమయంలో భావనపాడులోని మత్స్యకారులకు ఉచితంగా బోట్లు మంజూరు చేశాం.' అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి టీడీపీ నేతలు జీరు భీమారావు, బోయిన రమేష్, బగాది శేషగిరి, అట్టాడ రాంప్రసాద్, వెలమల విజయలక్ష్మి, రెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

డ్రైవింగ్ పరీక్షలు ఎలా?

- టెక్కలి, పలాస, ఇచ్ఛాపురంలో కానరాని ట్రాక్‌లు
- ప్రతిపాదనలకే పరిమితమైన నిర్మాణాలు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



(టెక్కలి)

ఏ వాహనం నడపాలన్నా డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. ఇంధన శకట తనిఖీ అధికారులు(ఎంవీఐ) క్షేత్రస్థాయిలో నిర్వహించే డ్రైవింగ్ పరీక్షల్లో పాసైతేనే వాహనం నడిపేందుకు లైసెన్స్‌ను మంజూరు చేస్తారు. అయితే డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ట్రాక్‌లు కొన్నిచోట్ల లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల సమీపంలో పది ఎకరాలను రవాణా శాఖకు గతంలో కేటాయించారు. ఇక్కడ ఒక చోట ట్రాక్ నిర్మాణం చేపట్టేందుకు ఇటీవల సంబంధిత కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. అయితే టెక్కలి ఎంవీఐ పరిధిలో ఏడు మండలాలు, పలాస, ఇచ్ఛాపురం ఎంవీఐల పరిధిలో చెరో ఐదు మండలాలు ఉన్నప్పటికీ ఇక్కడ డ్రైవింగ్ ట్రాక్‌ల నిర్మాణాలకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గతంలో ట్రాక్‌ల ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణకు ప్రతిపాదనలు చేసినా అవి బుట్టదాఖలయ్యాయి. టెక్కలి ఎంవీఐ పరిధిలో ట్రాక్ నిర్మాణానికి భీంపురం సమీపంలో గతంలో స్థలం చూపించారు. అది అనువుగా లేదని చెప్పి పక్కన పెట్టేశారు. డ్రైవింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు కనీసం ఆరున్నర ఎకరాల స్థలం ఉండాలి. ఇందులో ఒక లైట్‌ట్రాక్, ఒక హెవీ ట్రాక్, టూవీలర్ ట్రాక్ నిర్మించాలి. టూవీలర్, హెవీ ట్రైలర్ నడిపే స్థలంతో పాటు అప్రోచ్ రోడ్డు, కనీసం వంద టూవీలర్ల పార్కింగ్ ప్రాంతం, రెస్ట్‌రూం సౌకర్యం, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండాలి. కనీసం ఆ ప్రాంతంలో ఎంవీఐ కార్యాలయ నిర్మాణానికి మూడువేల చదరపు అడుగుల స్థలం అవసరం. ఇందుకు సంబంధించి ప్రభుత్వ స్థలాలను రవాణా శాఖకు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైంది. పట్టణాలకు శివారు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో ప్రభుత్వ స్థలాలను గుర్తించడంలో రెవెన్యూ, రవాణాశాఖలు సమన్వయ లోపం కనిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లాలో అవసరమైన స్థలాలను సేకరించి డ్రైవింగ్ ట్రాక్‌లను నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

స్పీడ్‌గన్ల కరువు

వాహనాల వేగాన్ని గుర్తించేందుకు అవసరమైన స్పీడ్‌గన్లు సైతం ఆయా ఇంధన శకట కార్యాలయాలకు కరువయ్యాయి. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం పరిధిలో ఒకటి మాత్రమే స్పీడ్‌గన్ ఉంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈఒక్క స్పీడ్‌గన్‌నే టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం ఎంవీఐ కార్యాలయాల పరిధిలో ఒక్కో వారం, ఒక్కో ప్రాంతానికి పంపిస్తున్నారు.

దృష్టి సారించలేదు

డ్రైవింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు అవసరం. నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. ట్రాక్‌ల ఏర్పాటుకు గతంలో ప్రతిపాదనలు పంపారో.. లేదో నాకు తెలియదు. ఎన్నికల విధుల్లో అధికారులంతా నిమగ్నం కావడంతో.. డ్రైవింగ్ ట్రాక్‌ల విషయమై దృష్టి సారించలేదు.

- ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, డీటీసీ



శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిర్మానుష్యంగా సూర్యమహల్ కూడలి

మండుతున్న సూరీడు

- జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు


జి.సిగడాం: కోనేరు వద్ద చెట్టు కింద సేదతీరుతున్న మూగజీవాలు

శ్రీకాకుళం అర్బన్/ జి.సిగడాం మార్చి 30: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓ వైపు ఎండల తీవ్రత.. మరోవైపు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఎండలకు భయపడి బయటకు రావా లంటేనే ప్రజలు హడలిపోతున్నారు. శ్రీకాకుళంలో శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో మధ్యాహ్నం 12గంటల సమయంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. నిత్యం రద్దీగా ఉండే సూర్యమహల్ కూడలి సైతం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. వేసవి ఆరంభంలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో వడగాల్పులు ఎలా భరించాలో అంటూ జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. భానుడి ప్రతాపంతో మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. శనివారం జి.సిగడాం మండలం పెంట నారప్పకోనేరు వద్ద చెట్ల కింద గొర్రెలు సేదతీరాయి.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

కలెక్టరేట్: 'ఎండల తీవ్రత దృష్ట్యా విపత్తు నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయాలి. అందరూ అప్రమత్తంగా ఉండాల'ని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రానున్న వేసవి వడగాల్పుల పరిస్థితులపై తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'వడగాలుల వలన జిల్లాలో ఏ ఒక్కరూ మృతి చెందరాదు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి. ప్రధాన కూడళ్లు, బస్టాండుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలి. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఉపాధి హామీ కూలీల కోసం ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సరఫరా చేయాలి. ప్రతీ మండలంలో శిబిరాలు నిర్వహించి పశువులకు మేత, తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ సర్వీసుల తొలగింపు


విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న అధికారులు

జలుమూరు, మార్చి 30: బకాయిలు చెల్లించని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ సర్వీసులను విద్యుత్‌శాఖ అధికారులు తొలగిస్తున్నారు. ప్రభుత్వం ఎస్సీలకు, ఎస్టీల ఇళ్ల సర్వీసులకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ చార్జీలు చెల్లించలేదు. కాగా.. విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని అధికారులు చెబుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ బిల్లులు చెల్లించని సర్వీసులను తొలగిస్తున్నా మని తెలిపారు. జలుమూరు మండలంలో ఎస్సీ, ఎస్టీ, గృహావసరాల విద్యుత్ కనెక్షన్లు 719 ఉన్నాయన్నారు. వీటిలో 419 సర్వీసుల బకాయి రూ.8.26 లక్షలు ఉన్నట్లు తెలిపారు. బకాయిలు చెల్లించకపోతే ఈ సర్వీసులన్నీ తొలగిస్తామని స్పష్టం చేశారు.

ఏప్రిల్ 3న జడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి, మార్చి 30: జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 3న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30గంటల నుంచి సమావేశం జరుగుతుందన్నారు.

మాజీ మావోయిస్టు అప్పన్న మృతి


అప్పన్న(ఫైల్)

హరిపురం, మార్చి 30: మందస మండలం గంగువాడ గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు గుంటు అప్పన్న అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఈయన 1969లో శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అడుగు వేసి 1992 మలిదశ పీపుల్స్‌వార్ ఉద్యమం వరకు వివిధ పోరాటాల్లో పాల్గొన్నారు. ఈయనపై పోలీసులు సుమారు 26 కేసులు నమోదు చేశారు. రెండేళ్లపాటు జైలు జీవితం గడిపి.. చివరి శ్వాస వరకు ఉద్యమం సాగించారు. గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో అమరవీరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షుడు తామాడ త్రిలోచన, సీఎల్‌సీ అధ్యక్షుడు పత్రి దానేసు, పీడీఎం అధ్యక్షుడు సాలిన వీరాస్వామి, కె.నీలకంఠం, బత్తిని లక్ష్మణ్, దుర్యోధన, బి.సాంబమూర్తి, పి.భీమారావు కె.వాసు పాల్గొన్నారు.

పలాసలో వైసీపీకి భారీ షాక్

- టీడీపీలో చేరిన సుమ్మాదేవి, రట్టి, కొండూరు, మంచినీళ్లపేట గ్రామ వైసీపీ నాయకులు
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన శిరీష, శివాజీ


పలాస: మాజీ మంత్రి గౌతు శివాజీ సమక్షంలో టీడీపీలో చేరిన పలాస మండల వైసీపీ నాయకులు

పలాస/హరిపురం, మార్చి 30: పలాస నియోజక వర్గం లో శనివారం వైసీపీకి చెందిన పలు వురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ కార్యాలయంలో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో వారికి మాజీ మంత్రి శివాజీ, టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పలాస మండలం సుమ్మా దేవి గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలకు శివాజీ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రెయ్యి హేమేశ్వరరావు, సానా సోమేశ్వరరావు, గర్తం జోగారావు, పాపారావు, విజయ్ కుమార్, మాధవరావు, జోగారావులతో పాటు 30 వైసీపీ కుటుంబాలున్నాయి. అలాగే వజ్రపుకొత్తూరు మండలం కొండూరుకు చెందిన గర్తం తోటమ్మ, దున్న గోపమ్మ, తులసమ్మ, సుందరమ్మ, దమయంతి, హేమలతతో పాటు 27 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మంచినీళ్లపేటకి చెందిన మాజీ సర్పంచ్ తులే కేశవరావు, వార్డు సభ్యులు సింగారి తదితరులకు శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే మందస మండలం రట్టి గ్రామంలో వైసీపీకి కీలక నేతలైన పులారి ధర్మారావు, చిన్న ధర్మారావు, పులారి రిషి తదితర యువ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం తీసుకున్నారు. వీరితో పాటు బెల్లుపటియా గ్రామ వైసీపీ నాయకులు నాగ సుభనాథ్, వంజరాపు మోహనరావు, చంద్రశేఖర్ తదితరులు కూడా టీడీపీలో చేరారు. వీరికి శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర నాయకుడు వై.వెంకన్న చౌదరి, మండల నేతలు కుత్తుమ లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్ కుమార్, మామిడి తాతారావు, దాసరి తాతారావు, అందాల నారాయణరావు, బమ్మిడి


బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న గౌతు శిరీష

క్రయ్య, అగ్గున్న బాబూరావు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలిసి అభివృద్ధి చేద్దాం: శిరీష

పలాస: పలాస నియోజకవర్గాన్ని కలిసి అభివృద్ధి చేద్దామని టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. శనివారం ఓ కల్యాణ మండపంలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ-బీజేపీ- జనసేన పార్టీలు ఉమ్మడిగా పలాస అభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామన్నారు. ప్రతి ఓటు విలువైందని, వైసీపీని ఓడించి అభివృద్ధికి శ్రీకారం చుడదామని పిలుపు నిచ్చారు. బీజేపీ నాయకుడు రామానందస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, బీజేపీ నాయకులు కొర్రాయి బాలకృష్ణయాదవ్, పి.వైకుంఠరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గంలో టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. శనివారం కొత్తూరు మండల టీడీపీ నాయకులు కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాతల గాంధీ, నాయకులు అగతముడి మాధవరావు, సుధాకర్, గెడ్డవలస కమలాకర్, పెద్దిన అమర్, యాదవ్, ముగితి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నను కలిసిన ఎచ్చెర్ల కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్

టెక్కలి: ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు శనివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అచ్చెన్నకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అచ్చెన్నను కలిసిన వారిలో పలువురు ఎచ్చెర్ల నియోజకవర్గ నేతలున్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్ఈఆర్

కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి పంచాయతీ నిమ్మాడ జంక్షన్‌లో శనివారం అభయాంజనేయ స్వామిని ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవశక్తి పొందడం ద్వారా ఓ అనుభూతి లభిస్తుందని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికత వైపు దృష్టి మరల్చాలన్నారు. కార్యక్రమంలో పెద్దబమ్మిడి పంచాయతీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఏం చేశారు?

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను ప్రశ్నించిన ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: నరసన్నపేట ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంగా నియోజకవర్గానికి ఏం చేశారని ధర్మాన కృష్ణదాస్‌ను ఉమ్మడి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రశ్నించారు. అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో డిప్యూటీ సీఎంగా ఉన్న కృష్ణదాస్ ఏం చేశారు, ఎందుకు ఆయనకు ఓటు వేయాలనే విషయాన్ని ప్రజలు గమనించాలని, ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ హయాంలో బొంతు ఎత్తిపోతల పథకం, శ్రీముఖలింగం రక్షిత నీటి పథకం, వనిత మండలం వంతెన నిర్మాణం పనులు ప్రారంభించి 60, 70 శాతం చేపట్టినా ఆ తరువాత వాటిని పూర్తి చేయడంలో కృష్ణదాస్ నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని, ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయో కృష్ణదాస్ సమాధానం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు. కార్య క్రమంలో జనసేన కన్వీనర్ బలగ ప్రవీణ్, బీజేపీ కన్వీనర్ రెడ్డి భాగ్య లక్ష్మి, సంపతిరావు తేజేశ్వరరావు, టీడీపీ నాయకులు ధర్మాన తేజేశ్వర రావు, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నరసన్నపేట పట్ట ణంలో బగ్గు రమణమూర్తి విస్తృ తంగా ప్రచారం చేశారు. శ్రీరామ నగర్, జయలక్ష్మీనగర్‌లో ఇంటింటా ప్రచారం చేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొద్దు చిట్టిబాబు, బెవర రాము, బలగ సుమతి, కింజరాపు రామారావు, బెవర శివ, ఉణ్న వెంకటేశ్వరరావు, తాళాభక్తుల గోవిందరావు, చలపాక మల్లేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.

సైకో పోవాలి సైకిల్ రావాలి

జలుమూరు (సారవకోట): రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే సైకో పాలన పోయి చంద్రబాబు నాయకత్వంలో సైకిల్ పాలన రావాలని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. సత్రాం, గొల్లపేట గ్రామాల్లో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● మూగుపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీకి చెందిన యువకులు టీడీపీలో చేరారు. వీరికి రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మాలపేట రాజారావుతో పాటు ఆయన అనుచరులున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, పలువురు నేతలు పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే బిడ్డలకు బంగారు భవిష్యత్తు

హరిపురం: రాష్ట్రానికి చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే మన బిడ్డలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలం బోగాపురంలో మాజీ సర్పంచ్ జేసి గణపతి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.


నరసన్నపేట: ఉమ్మడి పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం: పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం మండలాలతో పాటు కొత్తూరు మండల పరిధిలోని నివగాం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరిధిలో వివిధ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు విస్తరణతో వ్యాపారుల గగ్గోలు



విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక కంబకాయి జంక్షన్ నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులను ఆర్అండ్‌బీ అధికారులు శనివారం చేపట్టడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పాత బస్టాండ్ సమీపంలో ముఖద్వారం వద్ద షాపులు తొలగింపునకు మంత్రాలు తీసుకురావడంతో వారంతా ఆవేదనకు గురయ్యారు. రెండు వైపులా ఒకే విధంగా తొలగించాలని, ఒకవైపు తొలగించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆర్అండ్‌బీ అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. అయితే ఈ రోడ్డు విస్తరణ వల్ల పలు గ్రామాలకు మరింత అనుసంధానం జరుగుతుందని ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్ అన్నారు.

'పార్టీని నమ్ముకుంటే అన్యాయం చేశారు'


మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న వెంకటరమణమూర్తి

ఎల్.ఎన్.పేట: పార్టీని నమ్ముకొని ఐదేళ్లుగా పనిచేస్తే అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేపట్టారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి శ్రమిస్తే.. గ్రామాల్లో క్యాడర్ లేని వ్యక్తికి టికెట్ కేటాయించి పార్టీ నేతలు, కార్యకర్తల మనో భావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కలమట సాగర్, ఎం.మనో హర్‌నాయుడు, కె.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మే 18 నుంచి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు

నరసన్నపేట: స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరిగి 150 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మే 18 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పి.చిన్నవీరభద్రస్వామి, ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణసత్యమాచార్యులు, ఎం.జగదీశ్వరశర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పది రోజులు పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

టెక్కలి: ఏపీటీఎఫ్(1938) నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జి.ప్రసాదరావు, గౌరవ సలహాదారుగా ఎ.చిట్టెన్న, అధ్యక్షుడిగా ఎన్.సురేష్‌కుమార్, సహాధ్యక్షుడిగా బి.కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా ఎం.నారాయణమూర్తి, కె.చిన్నారావు, ప్రధానకార్యదర్శిగా వి.ఆదినారాయణలను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎం.భుజంగరావు వ్యవహరించారు.

ఘనంగా దుర్గాదేవి ప్రతిష్ఠోత్సవం

కరకవలస(ఎల్.ఎన్.పేట): కరక వలస లో శనివారం దుర్గాదేవి ప్రతిష్ఠోత్స వాన్ని పురోహితులు వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున గ్రామస్థులు అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.యోగీశ్వరరావు, గ్రామ పెద్దలు ఎం.సింహాచలం, శ్రీనివాస రావులతో పలువురు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న దుర్గాదేవి



పోలింగ్ సక్రమంగా నిర్వహించే బాధ్యత పీవోలదే..

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



నరసన్నపేట: మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



పాతపట్నం: మాట్లాడుతున్న జేసీ నవీన్

నరసన్నపేట, మార్చి 30: సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో పీవోలు, ఏపీవోలు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. శనివారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో నరసన్నపేట నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల పీవోలు, ఏపీవోల శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో పీవోలు పూర్తిస్థాయిలో అధికారాలను కలిగి ఉంటారని, వాటికి తగినట్టుగా నిబంధనలను పాటించి పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల బయట ప్రశాంత వాతా వరణం, ప్రజాస్వామ్యంగా పోలింగ్ ప్రక్రియను ఇతర అధికారులు చూసుకుంటారన్నారు. శిక్షణలో తెలు సుకున్న విషయాలను పీవోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఆర్వో జీవీఎస్ రామ్మోహన్‌రావు, ఏఆర్వో కనకరావు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి: జేసీ

పలాస/పాతపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎంనవీన్ అన్నారు. కాశీబుగ్గ, పాతపట్నంలలో పలాస, పాతపట్నం నియోజక వర్గాల్లోని పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఓటరు ఓటు హక్కు వినియో గించుకునేలా తగు వాతావరణం కల్పించాలన్నారు. ముందుగానే ఈవీఎంలు సరిచూసుకుని అన్నీ సక్ర మంగా ఉన్నట్లు ధ్రువీకరించుకుని పోలింగ్ ప్రారంభించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో బాధ్యతా యుతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్, ప్రత్యేకాధికారి చిట్టిరాజు, పాతపట్నం ఆర్వో ఎం.అప్పారావు, రెండు నియోజకవర్గాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పీవో, ఏపీవోలే కీలకం

టెక్కలి: ఎన్నికల నిర్వహణలో పీవోలు, ఏపీవోలే కీలకమని మాస్టర్ ట్రైనీ, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ అన్నారు. శనివారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో టెక్కలి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పులు జరగకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పని సరిగా అమలు చేయాలన్నారు. ఎన్నికల విధులు, ఈవీఎం ప్యాట్ల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ బూత్‌ల్లో పీవోలదే పూర్తి అధికారమని, ఎటువంటి అనుమానాలున్నా వెంటనే మాస్టర్ ట్రైనీస్‌ని అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్వో నూరుల్ కమర్, ఏఆర్వో మురళీ కృష్ణ, ఎలక్షన్ డీటీ శంకర్, డీఎల్పీవో అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊక లోడ్లతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు



నందిగాం బజారు, జలుమూరు: చల్లవానిపేట కూడలిలో ఊకలోడుతో నిలిచిపోయిన ట్రాఫిక్

నందిగాం/జలుమూరు: నందిగాం బజారు, జలుమూరు మండలం చల్లవానిపేట కూడలిలో నిత్యం ఊకతో భారీ వాహనాలు వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నందిగాంలో సాయంత్రం వేళ వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేవారు, రోజువారీ మార్కెట్‌తో బిజీగా ఉండే ప్రాంతాల గుండా ఊకలోడ్లు వస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. భారీ వాహనాలను తప్పించుకుని వెళ్లేందుకు వీలులేక వాహన దారులు తీవ్ర ఇక్కట్లకు గురువుతున్నారు. భారీ వాహనాల వల్ల రోడ్డుకు రెండువైపులా విద్యుత్ లైన్ సర్వీసులు తెగి పడుతుండడంతో విద్యుత్ నిలిచిపోయి వినియోగదారులు అవస్థలకు గురవుతున్నారు.

అలాగే జలుమూరు మండలంలోనూ వివిధ మిల్లుల నుంచి ఊక లారీలతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఊకలోడు వాహనాల రాకపోకలను నియంత్రించాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

నరసన్నపేట: ప్రతి ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆర్ఐ లోకేష్ అన్నారు. శనివారం పట్టణంలో జగన్నాథపురం, పెద్దపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యాక్రమంలో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

● **నందిగాం:** మండలంలోని నౌగాం, బెజ్జిపల్లి పంచాయతీల్లో శనివారం ఓటుహక్కు వినియోగంపై సదస్సులు నిర్వహించారు. వెలుగు ఆధ్వర్యంలో సిబ్బంది, మహిళా సంఘాలు, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలు ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేశారు.

● **జలుమూరు:** సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం తవిటినాయుడు అన్నారు. జలుమూరులో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో గొలివి బాలకృష్ణ, వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ఎలుగు' బాధితులకు ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లి గ్రామంలో ఇటీవల ఎలుగు దాడితో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎఫ్ఆర్‌వో మురళీకృష్ణంనాయుడు, ఎస్‌వో జోగారావు రూ. 2.50 లక్షలు చొప్పున శనివారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుకుని..వదిలేశారు!

- ఎస్ఈబీ పేరుతో వసూళ్లు?

మెళియాపుట్టి: ఎన్నికల నేపథ్యంలో పక్క రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతుల నియంత్రణ, సారా తయారీ లేకుండా చూడడం, బెల్ట్ షాపులను నియంత్రించేందుకు ఎస్ఈబీ అధికారులు, పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అయితే అక్రమంగా మద్యం దిగుమతులు చేస్తున్న కొందరిని పట్టుకుని కేసులు నమోదు చేస్తుండగా మరికొందరిని కేసులు లేకుండా వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం ఉదయం మెళియాపుట్టిలో మద్యం దుకాణానికి సమీపంలో ఒక మహిళ వద్ద మద్యం సీసాలను పట్టుకున్నట్లు సమాచారం. సెబ్ అధికారులుగా చెప్పుకుంటున్న కొందరు.. మహిళను కారులో కొంతదూరం తీసుకెళ్లి బేరం కుదుర్చుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనవద్ద నగదు లేదని ఆమె తెలపడంతో ఎవరి వద్దనైనా అప్పు తీసుకుని ఇవ్వాలని ఒత్తిడి చేయగా ఆమె ఓ వ్యాపారి వద్ద కొంత మొత్తం తీసుకుని వారికి ఇచ్చి నట్లు సమాచారం. అయితే ఈ మొత్తం వసూలు చేసింది ఎస్ఈబీ అధికారులా, లేక నకిలీ బృందమా అనేది నిర్ధారణ కావాల్సి ఉంది.

ఈ ఘటనపై టెక్కలి ఎస్ఈబీ హెచ్‌సీ పద్మలోచనను వివరణ కోరగా తమ వారెవరూ ఎవరినీ పట్టుకోలేదన్నారు. మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ వద్ద ప్రస్తావించగా తమ సిబ్బంది ఎవరినీ ఈ రోజు పట్టుకోలేదని పేర్కొన్నారు.

రోడ్లు దారుణంగా ఉన్నాయి

- మండల సమావేశంలో సభ్యుల ఆవేదన

పాతపట్నం: గ్రామాల్లో జల్‌జీవన్ పనులు చేపట్టారని, అయితే పైప్‌లైన్‌కు గోతులు తీయడంతో రోడ్లు పాడయ్యాయని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కొండాల యరకయ్య మాట్లాడుతూ.. ఇళ్లకు నీరు రాలేదని, రోడ్లు అధ్వానంగా తయారవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాకపోకలకు అవస్థలు పడుతున్నారన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కారణంగా కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టలేమని, మరమ్మతుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. బోరుభద్ర చంగుడి తదితర గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నా యని, కొత్త స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసు కోవాలని కోరారు. నిధులు మంజూరైన పాతపట్నం- తెంబూరు, ఆలాంధ్రరోడ్ గుండా మెళియాపుట్టి తదితర రోడ్ పనులు జరగలేదన్నారు. కనీస మరమ్మతులు చేయించాలని పలువురు ఎంపీటీసీలు కోరగా కొత్త పనులు చేపట్టలేదమని, మరమ్మతుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఏఈ రవి తెలిపారు. ఎంపీడీవో కె. రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి మతిస్థిమితం లేని యువకుడి మృతి



నవీన్(ఫైల్)

నందిగాం: హరిదాసుపురం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని తలగాన నవీన్(27) చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నవీన్ గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరగిరాక పోవడంతో అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెదికారు. అయితే శనివారం గ్రామ సమీపంలోని బంజరుబంద చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లి సత్యవతి పోలీసులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ఆసుపత్రికి తరలించారు. నవీన్ తండ్రి వెంకట్రావు గతంలో మృతి చెందగా, తల్లి, వివాహిత సోదరి ఉన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



సీసీ కెమెరాలో నమోదైన అనుమానితుడు

టెక్కలి: జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం మధ్యాహ్నం ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురికావడంతో వాహన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ పి.పైడయ్య ఆయా రూట్ల లో సీసీ కెమెరాలను పరిశీలించారు. టీవీ ఎస్ ఎక్సెల్ వాహనాన్ని ముఖానికి మాస్క్ కట్టుకున్న ఓ వ్యక్తి చోరీ చేసినట్టు గుర్తించామని, దీనిపై నిఘా వేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ తెలిపారు.

బంగారు వస్తువుల చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

మెళియాపుట్టి: చాపర గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన చోరీలో సుమారు ఏడు తులాల బంగారం వస్తువులు చోరీకి గురైనట్టు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన గోకర్ల వజ్రమ్మ అండమాన్‌లో ఉద్యోగం చేస్తోంది. ఇటీవల వచ్చిన వజ్రమ్మ.. బీరువాలో బంగారం వస్తువులు పెట్టి బయటకు వెళ్లింది. శుక్రవారం వచ్చి పరిశీలించగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం అందించింది. బ్రాస్లెట్, గొలుసు చోరీకి గురయ్యాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. శనివారం క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రెండు వారాలైనా పట్టదా?

● అమలు కాని ఎన్నికల కోడ్ ● పట్టించుకోని అధికారులు



తుమ్మావీధి-కొన్నావీధి రోడ్డులో మంత్రి ధర్మాన ఫొటోతో ఉన్న శిలాఫలకం

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 14 రోజులైనా సంబంధిత అధికారులకు పట్టకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతీ రోజూ ఎన్నికల కోడ్ తూ.చా. తప్పకుండా పాటించాలని ఉన్నతాధికారి ఆదేశించినా.. అది అమలు చేయాలన్న బాధ్యత ఉద్యోగుల్లో లేకపోయింది. నగరంలో ఏదో ఒక వీధిలో.. ఎక్కడో ఒక చోట అధికార పార్టీ నాయకుల ఫొటోలు, శంకుస్థాపనలు శిలాఫలకాలు దర్శనమిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో స్థానిక తుమ్మావీధిలో మంత్రి ధర్మాన ప్రసాదరావు చిత్రంతో ఉన్న శిలాఫలకాలను మూసివేయకుండా వదిలేయంతో ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కినట్ట యింది. ఇపక్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం



మోకాళ్లకు శస్త్ర చికిత్స చేస్తున్న వైద్య నిపుణులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 16 ఏళ్ల నుంచి అత్యాధునిక వైద్య సదుపాయాలతో ప్రజాదరణ పొందుతున్న బగ్గు సరోజినీదేవి ఆసుపత్రిలో శనివారం జరిగిన మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం అయిందని ఆసుపత్రి ఎండీ, న్యూరాలజిస్ట్ బగ్గు శ్రీనివాసరావు తెలిపారు. ఆర్థోపెడిషియన్, మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు సుగ్గు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ ఆర్థోపెడిషియన్ బూసిరెడ్డి నరేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ శస్త్ర చికిత్స జరిగింది. శనివారం మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. తమ ఆసుపత్రిలో ప్రపంచస్థాయి సాంకేతికతో ఆపరేషన్ థియేటర్లు, నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు. వీరి పర్యవేక్షణలో జరిగే శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయి ఉపశమనం పొంది మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఈ చికిత్స ద్వారా మూడు రోజుల్లో నడవడంతోపాటు 30 రోజుల తర్వాత దీర్ఘకాల పరిష్కారం పొందవచ్చునని ఆర్థోపెడిషియన్ నిపుణులు శ్రీనివాసరెడ్డి, నరేందర్ రెడ్డి వివరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

గుజరాతీపేట: ఉపాధి వేతనదారులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగారావు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘ జిల్లా కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉపాధి వేతనదారులకు ఐదు, ఆరు వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని పేద ప్రజలకు వారాలు తరబడి వేతనాలు చెల్లించకపోతే వారంతా ఎలా జీవిస్తారని ప్రభుత్వానికి ప్రశ్నించారు. ఎండ తీవ్రత ఎక్కువ అవుతుండడంతో ఒంటిపూట పని పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు గంగరాపు ఈశ్వరమ్మ, కొల్లి ఎల్లయ్య, మంగమ్మ, సింహాచలం, విజయ, నరసమ్మ, లక్ష్మణరావు, నీలవేణి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

గార: మండలంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా సారించారు. వరుసగా రెండు రోజులపాటు దాడులు నిర్వహించగా నిన్న లారీతో ఇసుక పట్టుబడగా, శనివారం ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తుండగా ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పట్టుకున్నారు. ఈ నెల 27న 'ఆంధ్ర జ్యోతి'లో ఇసుక అక్రమ రవాణాపై 'తవ్వుకో దండుకో' శీర్షిక ప్రచురితమైంది. దీంతో గార పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోలీసులు గార మండలం లో నిఘా ఉంచారు. దీంతో శనివారం అంబళ్లవలస, బూరవల్లి ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను ఎస్ఐ కృష్ణప్రసాద్ పట్టుకుని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటింగ్ శాతం పెంచండి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



ఆమదాలవలస: మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న జేసీ నవీన్

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న పీవోలు, ఏపీవోలు సమగ్ర శిక్షణ పొంది ఓటింగ్‌శాతం పెంచడానికి కృషి చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీసమూన్ కోరారు. శనివారం ఆమదాలవలస మండలంలోని కొర్లకోట సమీపంలోగల ఓ కల్యాణ మండపంలో పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12 మంది అసెంబ్లీ ట్రైన్ మాస్టర్లు ఇస్తున్న శిక్షణలో పీవో, ఏపీవోలకు ఇటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవాలని కోరారు. శిక్షణకు 730 మంది హాజరుకావాల్సి ఉండగా 32మంది గైర్హాజరయ్యారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీధర్ నాయక్‌ను ఎన్నికలకు సంబంధించి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ తహసీల్దార్లు కె.వేణుగోపాల్, పి.రమేష్‌బాబు, అంబేడ్కర్‌తోపాటు పొందూరు తహసీల్దార్, నాలుగు మండలాల రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం చూపొద్దు: జేసీ

ఇచ్ఛాపురం: ఎన్నికల విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని జేసీ నవీన్ కోరారు. శనివారం ఇచ్ఛాపురంలో ఏవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో పక్షపాత వైఖరి లేకుండా పోలింగ్, కౌంటింగ్ సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రీపోలింగ్ జరిగేందుకు అవకాశం ఇవ్వకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర, ఎన్నికల డీటీ శ్రీహరి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎచ్చెర్ల: ఫరీద్‌పేటలో జడ్పీ ఉన్నత పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల కోసం నిర్దేశించిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ జీఆర్ రాధిక శనివారం సందర్శించారు. ఈ కేంద్రం వద్ద భద్రత, మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో ఈవీఎంలు భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ వై.శృతి, సీఐ రామచంద్రరావు, ఎస్ఐ ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఫరీద్‌పేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ →



చంద్రబాబుతోనే సంక్షేమం: ఎంపీ



సోంపేట: ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

సోంపేట: రాష్ట్రంలో సంక్షేమరాజ్యం రావాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎంపీ రామ్మోహన్ నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని ఇస్కలపాలెంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆరోపించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే అనుభవం ఉన్న బాబుకే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, బూపల్లి బాబూరావు, నిట్ట గోపాల్ పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యం



కింతలిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పొందూరు: ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యమని ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని లైదాంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంచన చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, కుటుంబాన్ని వంచించడంతో పాటు మద్యపానం, మెగా డీఎస్సీ, ప్రతీ ఏడాది ఉద్యోగ నోటిఫికేషన్, సీపీఎస్ రద్దు వంటి హామీల పేరుతో రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసగించాడని ఆరోపించారు. అప్పులతో రాష్ట్రాన్ని 20 ఏళ్ళు వెనక్కు తీసుకువెళ్లాడని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పైడాడ రామ్మోహన్, లైదాం సర్పంచ్ జి. అనంత రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కె.సత్యనారాయణ, సీహెచ్ వాసుదేవరావు పాల్గొన్నారు.

కింతలిలో బాబు ష్యూరిటీ..

మండలంలోని కింతలిలో టీడీపీ నాయకులు శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో సర్పంచ్ పి.రామప్రసాద్, ఎంపీటీసీ హనుమంతురావు, నాయకులు లోకనాథం, రామారావు, అసిరినాయుడు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తి పొంది, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధించాలని శ్రీకాకుళం నియోజకవర్గ కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. శనివారం నగరంలోని వాంబే కాలనీ, మండలవీధుల్లో ఆయన కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీల జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందని, ఈ డిక్లరేషన్‌తో వైసీపీ నాయకుల వెన్నులో వణుకు పుట్టిందన్నారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా, డ్రగ్స్ రాజధానిగా మార్చిన ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ గాడిలో పెట్టి అభివృద్ధి పథంలో నడిపించగలిగే సామర్థ్యం, దూరదృష్టి చంద్రబాబు సొంతమన్నారు. రైతులు, మహిళలు, యువతకు పెద్దపీట వేసిన మినీ మ్యానిఫెస్టోలోని పథకాలను చూసి వైసీపీ నాయకులకు గుండెల్లో దడ మొదలైందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు సమష్టి కృషి



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఎచ్చెర్ల: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషిచేస్తామని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. ఎచ్చెర్లలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల టీడీపీ నేతలు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎన్నో ఏళ్లుగా టీడీపీ పటిష్టతకు పనిచేశామని, అయితే తమకు ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండా ఎమ్మెల్యే టికెట్‌ను బీజేపీకి కేటాయించారన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయపరిచేలా పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ తరఫున నియోజకవర్గంలో ఇన్‌చార్జీలను నియమించాలని కోరారు. కార్యక్రమంలో లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, లంక శ్యామ్, కుమరాపు రవి, మాజీ ఎంపీపీలు గొర్లె విజయకుమార్, డీజీఎం ఆనందరావు, పార్టీ నేతలు వావిలపల్లి రామకృష్ణ, సంధ్యా గజపతి, పిస్నింటి మధుబాబు, పిసిని జగన్నాథం, రాజాపంతుల ప్రకాశరావు, బోర శ్రీనివాసరావు, మెండ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కలిశెట్టికి ఘనస్వాగతం

రణస్థలం: విజయనగరం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడకు శనివారం ఘనస్వాగతం లభించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తున్న సంగతి విదితమే. విజయనగరం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం కలిశెట్టి పేరును ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో విజయవాడ నుంచి రణస్థలం చేరుకున్న కలిశెట్టికు విశాఖ నుంచి అడుగడుగునా అభిమానులు ఘనస్వాగతం పలికారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రచార రథంలో అభిమానులకు కలిశెట్టి అభివాదం చేశాడు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పిసిని జగన్నాథం నాయుడు, లంక ప్రభ, రౌతు శ్రీనివాసరావు, పిస్నింటి భానూజీరావు, పైడి అప్పడదొర, పిసిని అసిరినాయుడు, గొర్లె లక్ష్మణరావు, మత్స్యకార నాయకుడు దుమ్ము అశోక్, బాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి పూసపాటి అశోకగజపతి రాజును విజయనగరంలో శనివారం కలుసుకుని ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.



కలిశెట్టికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

ఎన్ఈఆర్‌ని కలిసిన నాయకులు



ఎన్ఈఆర్‌ని అభినందిస్తున్న వివిధ పార్టీల నాయకులు

జి.సిగడాం: వివిధ పార్టీలకు చెందిన మండల నాయకులు శనివారం ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్డీఏ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)ను కలిసి అభినందించటంతో పాటు తమ మద్దతు తెలిపారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు అందరం కలిసికట్టుగా పనిచేసి తమ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్ఈఆర్‌కి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వజ్జపర్తి రఘురాం, మీసాల రామకృష్ణ, సిగటాపు గోవిందరావుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో గత మూడు రోజులుగా శ్రీ సుమిత్ర కళా సమితి ఆధర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శనివారంతో ముగిశాయి. చివరి రోజున గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ఎస్.రవీంద్ర రెడ్డి దర్శకత్వంలో 'ఇంద్రప్రస్థం' నాటిక ఆద్యాంతం ప్రేక్షకులను అలరించింది. అదేవిధంగా కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ దర్శకుడు బాలినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గోవిందరాజులు, నాగేశ్వరరావు రచనలో 'పక్కింటి మొగుడు' సాంఘిక నాటిక హాస్యాభరితంగా ప్రేక్షకులను నవ్వులలో ముంచెత్తింది. కళా సమితి గౌరవ అధ్యక్షుడు కొంచాడ సోమేశ్వరరావు, అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, ప్రధాన కార్యదర్శి చిన్నారావు పర్యవేక్షణలో సాగింది.

ఇచ్ఛాపురంలో ఐక్యత ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న క్రిస్టియన్లు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో శనివారం క్రిస్టియన్లు రన్ ఫర్ జీసెస్ పేరుతో ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి సురంగి రాజా కోట వరకు సాగింది. జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం సీఐ ఉమామహేశ్వరరావు బలగ ప్రాంతంలో కేంద్ర బలగాలు, పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక దమ్మలవీధి, కంద్రవీధి, హయాతినగరం ప్రాంతాల్లో వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు

కంచిలి: మండలంలోని కొన్నాయిపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, శాసనాం, అంపురంలో శనివారం అధికారులు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.కార్యక్రమంలో ఎంఈవో ఎస్. శివరామ ప్రసాద్, ఏవో ధనుంజయ, ఏపీఎం ఉమారాణి , ఈవోపీఆర్డీ రాంబాబు,బీఎల్వోలు,వెల్ఫేర్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● **కవిటి:** మండలంలోని బొరివంకలో మహిళా సంఘాల సభ్యులతో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో గోవిందు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి గుణవతి, సీసీలు పాల్గొన్నారు.

● **సోంపేట:** ఓటుహక్కు వినియోగంపై బారువకొత్తూరు, పాలవలసల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం రమణమ్మ, సీసీ రాణి, ఏవో నరసింహమూర్తి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** కొళిగాం, పాయితారి, కీర్తిపురం పంచాయతీల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మానవహారం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం సనపల ప్రసాద్ పాల్గొన్నారు.

● **గార:** కె.మత్స్యలేశంలో శనివారం వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూడలి వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీ-విజిల్ యాప్‌తో ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట

అరసవల్లి: ఎన్నికలు పూర్తయ్యేంతవరకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉంటుందని, ఎవరైనా ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని టీడీపీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విషయంపై టీడీపీ శ్రేణులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, నియమాళిని అతిక్రమిస్తే వెంటనే ఫొటో, ఆడియో, వీడియో తీసి సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే, అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల్లో ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. వలంటీర్లు సంక్షేమ పింఛన్లు బట్వాడా చేసేటప్పుడు ఓటర్లను భయపెట్టి, ప్రలోభపెట్టినా ఫిర్యాదు చేయాలన్నారు. బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు కొమనాపల్లి వెంకటరామరాజు, ఐటీడీపీ అధ్యక్షుడు ప్రధాన విజయరాం, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బొనిగి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూసుకోండి

కంచిలి: వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎంపీపీ దేవదాస్ రెడ్డి సూచించారు.శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.నీరజ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ ప్రయోజనాలే ముఖ్యం

అరసవల్లి: వ్యక్తి ప్రయోజనం కంటే పార్టీ ప్రయోజనాల కోసం క్రమశిక్షణతో పనిచేసే వారే నిజమైన నాయకులని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. శనివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన వ్యక్తిని రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ నియమిస్తే ఎంతో సంతోషించామని, కానీ మాతో పాటు అనేకమంది నాయకులు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతామని భావించలేదని తెలిపారు. అధినేత చంద్రబాబు పార్టీ ప్రయోజనాల కోసం చేస్తున్న కృషికి మనమందరం ఏకాభిప్రాయానికి వచ్చి పార్టీ ప్రతిష్ఠను పెంచేలా సహకరించాలని తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ



ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని శ్రీనివాస ప్రార్థనా మందిరం ఆవరణలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. శ్రీ పద్మావతి సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశాల మేరకే సహకారం

ఇచ్ఛాపురం: తమ పార్టీ అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే ఇచ్ఛాపురం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బెందాళం అశోక్‌కు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలారెడ్డి తెలిపారు. శనివారం ఇచ్ఛాపురంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాలు వచ్చిన తర్వాత అశోక్‌తో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి అందరికి సమన్వయం చేస్తేనే సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

గెలుపునకు కృషిచేయాలి



అచ్చెన్నాయుడుతో చౌదరి బాబ్జీ తదితరులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేయనున్న కూటమి అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులంతా కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సూచించినట్టు జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి తెలిపారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో శనివారం అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిసినట్టు చెప్పారు. జిల్లాలోని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి గ్రామ స్థాయిలో మూడు పార్టీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఫరీద్‌పేట మాజీ ఎంపీటీసీ కొత్తకోట అమ్మినాయుడు, పెదరావుపల్లి సర్పంచ్ కొన్ని హేమసుందరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పైడితల్లి అమ్మవారి జాతర

పొందూరు: పొందూరు పైడితల్లి అమ్మవారి 39వ యాత్రా మహోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. మూడురోజులపాటు యాత్ర నిర్వహించనున్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా యాత్రా కమిటీతో పాటు పలువురు దాతలు భక్తులకు మంచినీరు, మజ్జిగ భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా పోలీసు అధికారులు జాతర కార్యక్ర మాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేయాలని పేర్కొనడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం



ఆలయ ఈవోకు విరాళాన్ని అందిస్తున్న భక్తులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం నగరానికి చెందిన దేవరశెట్టి సురేష్, పూర్ణ దంపతులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయలను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. వారిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఈవో స్వామివారి జ్ఞాపికను అందజేశారు.